Digital, tmedia.net.in

# టీ-మీడియా


మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 275
పేజీలు : 4
సోమవారం 04.05.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ



## ఘనంగా బండ్ల గణేష్ కుమార్తె నిశ్చితార్థం

**టీ మీడియా, మే3,హైదరాబాద్ :** సినీనటుడు, నిర్మాత బండ్ల గణేష్ ఇంట పెండ్లి సందడి నెలకొంది. ఆయన కుమార్తె జననికి, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజతో వివాహం జరగనుంది. వీరి నిశ్చితార్థ వేడుకను ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎపి సిఎం చంద్రబాబు దంపతులు, ప్రముఖ సినీనటుడు చిరంజీవితో సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై, కాబోయే దంపతులను ఆశీర్వదించారు. రాఘవేంద్ర రావు, బ్రహ్మానందం, కోన వెంకట్, శివాజీ, సి.కల్యాణ్, తదితరులు ఈ వేడుకల్లో సందడి చేశారు.

# నిండా మునిగిన మొక్కజొన్న రైతు



- పట్టించుకోని కేంద్రం
- 3 వేల కోట్లు నష్టం

**టీ మీడియా, మే3,అమరావతి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకం వలన రబీలో మొక్కజొన్న పండించిన రైతులు నిండా మునిగారు. పంటల సరళిలో వచ్చిన మార్పుల కారణంగా రబీలో అసాధారణంగా మొక్కజొన్న విస్తీర్ణం పెరగగా, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆ పర్యవసానాలను ముందుగా పసిగట్టడంలో వైఫల్యం చెందింది. మరోవైపు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పంట కొనుగోళ్లు, మార్కెట్‌లో జోక్యం తదితర పథకాల నుంచి వైదొలిగి నామమాత్రంగా ప్రైస్ డిఫరెన్స్ పేమెంట్ (పిడిపి)ని అమలు చేస్తోంది. మొక్కజొన్న పంట ధరలు భారీగా పతనం కావడంతో రైతులు పండించిన పంట మొత్తానికి పిడిపిని అమలు చేయడంతో పాటు రాష్ట్రం వాటా నిధులను సైతం కేంద్రమే భరించాలని కూటమి ప్రభుత్వం తరపున స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రెండుసార్లు లేఖలు రాసినా స్పందించలేదు. ఇంకోవైపు రబీలో సాగు చేసిన మొక్కజొన్నలో చాలా మట్టుకు కోతలు ముగిశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తాయన్న ఆశ చచ్చిపోయి ధర వచ్చిన కాడికి అధిక భాగం పంటను తెగనమ్ముకున్నారు. ఇప్పటికి రైతులు ఎంఎస్‌పితో పోల్చితే తక్కువలో తక్కువ రూ.2 వేల కోట్ల వరకు నష్టపోయారని అంచనా. వాస్తవంగా పంట పండించడానికి చేసిన ఖర్చుతో చూసుకుంటే రూ.3 వేల కోట్ల వరకు కోల్పోయారని తెలుస్తోంది.

### ఏడున్నర లక్షల ఎకరాలు పెరిగింది

రబీలో మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 5 లక్షల ఎకరాలు కాగా ఈ తడవ అసాధారణంగా సాగు 12.5 లక్షల ఎకరాలకు చేరుకుంది. గతేడాది 4.65 లక్షల ఎకరాల్లో సాగైంది. సాధారణ సాగు కంటే ఏడున్నర లక్షలు పెరగడానికి పంటల సరళిలో వచ్చిన మార్పులే కారణం. రెండేళ్ల నుంచి మిర్చి, పత్తి, వేరుశనగ, పొగాకు, తదితర పంటలకు ధరల్లేవు. దాంతో ఆ పంటల స్థానంలో మొక్కజొన్న వేశారు. ఈ మార్పును అంతపెద్ద వ్యవస్థ కలిగిన ప్రభుత్వం పట్టించుకోలేదు. గ్రామస్థాయికి వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు. ఇ-క్రాప్ నమోదులు జరుగుతున్నాయి కూడా. వాతావరణం అనుకూలించడం, భూగర్భజలాలు, ప్రాజెక్టులలో నీటి లభ్యత అందుబాటులో ఉండటంతో రైతులు మొక్కజొన్నకు కనీస గ్యారంటీ ఉందని తలచి ఆ పంట సాగుకు మళ్లారు. అత్యధికంగా నంద్యాల జిల్లాలో లక్షన్నర ఎకరాలకుపైన సాగైంది. ఇంకా బాపట్ల, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, అనంతపురం, కడప, కర్నూలు తదితర జిల్లాల్లో మొక్కజొన్న సాగు ఎప్పటికంటే పెరిగింది. పంట దిగుబడి సైతం ఆశాజనకంగా ఉంది. రబీలో 40 లక్షల టన్నులకుపైన దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కాగా దీనిలో ఇప్పటికే 80 శాతం పంట కోతలు పూర్తయ్యాయి. ఇంకా 20 శాతం విస్తీర్ణంలో పంట కోతలకు సిద్ధంగా ఉంది. చేతికొచ్చిన పంటలో 60 శాతం మేర రైతులు ఎంఎస్‌పి క్వింటాకు రూ.2,400కాగా, అంత కంటే సరాసరిన రూ.800 వరకు ధర కోల్పోయారు. సుమారు 25 లక్షల టన్నుల పంటను ఈ ధరకు అమ్ముకున్నారని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఆ వంతున రైతుకు ఎంఎస్‌పి రానందున రూ.2 వేల కోట్ల వరకు నష్టాలను చవిచూశారు. ఉత్పత్తి ఖర్చుతో (కౌలుతో సహా) లెక్కేస్తే నష్టం రూ.3 వేల కోట్లకు పైమాటే. చేతికొచ్చిన పంటలో 20 శాతాన్ని (సుమారు 8 లక్షల టన్నులు) నిల్వకు అవకాశం ఉన్న రైతులు ధర కోసం నిల్వ చేసి ఎదురు చూస్తున్నారు. హార్వెస్టింగ్ జరిగితే ఇంకో 8-10 లక్షల టన్నుల పంట రైతుల చేతికొస్తుంది. ఇవే పరిస్థితులు కొనసాగితే హార్వెస్టింగ్ చేసే రైతులు సైతం ధర లేక నష్టపోవాల్సి వస్తుంది.

### ప్రభుత్వం తాత్సారం


రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు తెరవలేదు. పంటను కొనుగోలు చేయకుండా పిడిపి అంటోంది. అది కూడా కార్యాచరణలోకి రాలేదు. వేసవిలో కురుస్తున్న అకాల వర్షాలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. డీజిల్, పెట్రోలు కొరత పంట కోతలకు ఆటంకంగా మారింది. మే నెల సమీపించడంతో రానున్న ఖరీఫ్‌నకు సిద్ధం కావాల్సి ఉంది. ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంపై ఉందని ప్రభుత్వం ప్రకటించింది. పంట కాలాన్ని మే 15కు కాస్త ముందుకు జరపాలని చెబుతోంది. ఈ పరిస్థితులు ఉండి కూడా మొక్కజొన్న పంట కొనుగోలుపై ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. ప్రభుత్వ చర్యలు రైతులను ఆదుకొనేలా కాకుండా వారి మానాన వారిని వదిలిపెట్టేవిగా ఉన్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.

# ఇరాన్‌పై మళ్లీ దాడులా?

## ట్రంప్ హెచ్చరికలు

- 14 పాయింట్ల ప్రతిపాదనపై అనుమానాలు

**టి మీడియా , మే 3 , ఢిల్లీ బ్యూరో :**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్? మరోసారి ఇరాన్‌పై కఠిన వ్యాఖ్యలు చేసి అంతర్జాతీయ రాజకీయాల్లో ఉద్రిక్తతలను పెంచారు. ఇరాన్ తప్పుగా ప్రవర్తిస్తే మళ్లీ సైనిక దాడులు ప్రారంభించే అవకాశముందని ఆయన స్పష్టం చేశారు. సౌత్ ఫ్లోరిడాలో ఎయిర్ ఫోర్స్ వన్ ఎక్కే సమయంలో మీడియాతో మాట్లాడిన ట్రంప్, అవసరమైతే మిలిటరీ యాక్షన్ మళ్లీ చేపట్టడాన్ని తిరస్కరించలేమన్నారు.ఇరాన్ ఏదైనా తప్పు చేస్తే, లేదా పరిస్థితులు అదుపు తప్పితే మళ్లీ దాడులు జరగవచ్చు. అది పూర్తిగా ఒక అవకాశమే" అని ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితులను పరిశీలిస్తున్నామని, వెంటనే నిర్ణయం తీసుకునే పరిస్థితి లేదని ఆయన తెలిపారు. ఇరాన్‌తో జరుగుతున్న చర్చల గురించి కూడా ట్రంప్ స్పందించారు. చర్చలు కొనసాగుతున్నప్పటికీ, తేహ్రాన్‌లో స్పష్టమైన నాయకత్వం లేకపోవడం సమస్యగా మారిందన్నారు.



అదే జరిగితే మళ్లీ బలపడే అవకాశం!
"ఇరాన్ ఒప్పందం చేయాలనుకుంటోంది. కానీ వారి నాయకత్వం గందరగోళంలో ఉంది. అసలు ఎవరు నాయకుడు అన్నది వారికి తెలియడం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇక ఇరాన్ సైనిక సామర్థ్యాల విషయానికొస్తే, ముఖ్యంగా క్షిపణి తయారీ వ్యవస్థను పూర్తిగా తొలగించాలని అమెరికా లక్ష్యంగా పెట్టుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. "ఆ సామర్థ్యాన్ని పూర్తిగా తొలగించాలి. అది జరిగితే, వారు మళ్లీ బలపడే అవకాశం తగ్గుతుంది" అని ఆయన చెప్పారు.ఇదే సమయంలో, ఇరాన్ తాజాగా అమెరికాకు సమర్పించిన 14 పాయింట్ల ప్రతిపాదనపై ట్రంప్ తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనను త్వరలో సమీక్షించనున్నట్లు ఆయన తెలిపారు. అయితే, అది ఆమోదయోగ్యంగా ఉండకపోవచ్చని ముందుగానే సంకేతాలు ఇచ్చారు. ట్రూత్ సోషల్‌లో చేసిన పోస్టులో ట్రంప్, "ఇరాన్ చేసిన చర్యలకు ఇప్పటికీ సరిపడా మూల్యం చెల్లించలేదు. అందుకే వారి ప్రతిపాదనను అంగీకరించడం కష్టమే అనిపిస్తోంది" అని పేర్కొన్నారు. గత 47 సంవత్సరాల్లో ప్రపంచానికి ఇరాన్ కలిగించిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని, కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రణాళికపై ట్రంప్ ఇలా!
మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ, ఈ 14 పాయింట్ల ప్రణాళిక పూర్తి వివరాలు ఇంకా తనకు అందలేదని ట్రంప్ చెప్పారు. "ప్రస్తుతం దాని కాన్సెప్ట్ గురించి మాత్రమే చెప్పారు. పూర్తి వివరాలు త్వరలో వస్తాయి. చూసి తర్వాత నిర్ణయం చెబుతాను" అని అన్నారు. ఇరాన్ ప్రతిపాదనలో యుద్ధాన్ని పూర్తిగా ముగించే విధంగా సమగ్ర ప్రణాళిక ఉందని సమాచారం. లెబనాన్ వంటి ప్రాంతాల్లో కూడా శాంతి నెలకొల్పే లక్ష్యంతో ఈ ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది. అమెరికా ముందుగా ఇచ్చిన 9 పాయింట్ల ప్రతిపాదనలో రెండు నెలల కాలపరిమితితో కాల్పుల విరమణ సూచించగా, ఇరాన్ మాత్రం 30 రోజుల్లోనే శాశ్వత పరిష్కారం కావాలని పట్టుబడుతోంది.ఇక యూరప్‌తో అమెరికా సంబంధాల విషయానికొస్తే, ట్రంప్ వ్యాఖ్యలు మరింత వివాదాస్పదంగా మారాయి. ముఖ్యంగా ఫ్రైడ్?రిచ్? మెర్జ్?పై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. జర్మనీ దేశీయ సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. జర్మనీ చాన్సలర్ మెర్జ్ పనితీరు సరిగా లేదని ట్రంప్ విమర్శించారు. "అక్కడ ఇమ్మిగ్రేషన్, ఎనర్జీ, ఉక్రెయిన్ సమస్యలు ఉన్నాయి. వాటిని చూసుకోవాలి" అని అన్నారు. ఇరాన్ విషయంలో అమెరికాను విమర్శించడం సరికాదని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో జర్మనీలో ఉన్న అమెరికా సైనిక బలగాలను తగ్గించేందుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధమవుతోంది.ఇప్పటికే 5,000 మంది సైనికులను వెనక్కి పిలవాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ, అది ఇంకా పెరిగే అవకాశం ఉందని ట్రంప్ స్పష్టం చేశారు. "మేము చాలా పెద్ద స్థాయిలో తగ్గిస్తున్నాం. 5,000 కంటే ఎక్కువే తగ్గిస్తాం" అని తెలిపారు. ఈ నిర్ణయం యూరప్ దేశాలతో అమెరికా మధ్య ఉన్న విభేదాలను మరింత పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఇరాన్‌పై సైనిక చర్యల విషయంలో యూరప్ దేశాలు పూర్తి మద్దతు ఇవ్వకపోవడం అమెరికాకు అసంతృప్తిని కలిగించినట్లు తెలుస్తోంది. ఇక ఇటలీ, స్పెయిన్ వంటి దేశాల నుంచి కూడా అమెరికా సైనిక బలగాలను ఉపసంహరించుకునే అవకాశాన్ని ట్రంప్ సూచించారు. ఈ చర్యలు నాటో కూటమిలో విభేదాలకు దారితీయవచ్చని అంతర్జాతీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# బంగాల్ ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

- 11 జిల్లాల్లో హై అలర్ట్- ఎవరు గెలుస్తారో?

**టి మీడియా , మే 3 , ఢిల్లీ బ్యూరో :** బంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కోసం యావత్ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. హోరాహోరీ ప్రచారం, రికార్డు స్థాయి పోలింగ్, టీఎంసీ- బీజేపీ మధ్య గట్టిపోటీ నెలకొందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాల మధ్య సోమవారం ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు మొదలుకానుంది. నాల్గోసారి మళ్లీ అధికారం చేపట్టాలని అధికార టీఎంసీ భావిస్తుండగా, చరిత్రాత్మక విజయంతో బంగాల్? గడ్డపై తొలిసారి కాషాయ జెండా ఎగరేయాలని బీజేపీ పట్టుదలతో ఉంది. గత ఎన్నికల్లో ఉనికి కోల్పోయిన సీపీఎం, కాంగ్రెస్ పార్టీలు కూడా ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి.

బంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకుగానూ 293 నియోజకర్గాల ఫలితాలు సోమవారం వెలువడనున్నాయి. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 'ఫల్తా' నియోజకవర్గంలో ఎన్నికల అక్రమాల కారణంగా పోలింగ్‌ను ఈసీ రద్దుచేసింది. అక్కడ ఈనెల 21న రీ-పోలింగ్, మే 24న కౌంటింగ్ జరగనుంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 2నియోజకవర్గాల పరిధిలోని 15 పోలింగ్ కేంద్రాల్లో శనివారం రీపోలింగ్ ముగిసింది. 87శాతం ఓటింగ్ నమోదైంది. రెండు విడతల పోలింగ్ ముగిసిన తర్వాత కూడా బంగాల్‌లో రాజకీయంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రధానపోటీదారులైన టీఎంసీ, బీజేపీ లు కూడా తమదే విజయమని ధీమా వ్యక్తం చేశాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బంగాల్‌లో 92.47 శాతం ఓటింగ్ జరగడం ఇదే తొలిసారి. 2.5లక్షల మంది కేంద్ర పారా మిలిటరీ బలగాలు, రాష్ట్ర పోలీసుల భారీ బందోబస్తు మధ్య చెదురుమదురు ఘటనలు మినహా రెండు విడతల్లో జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

### అందరి దృష్టి 'భవానీపుర్' నియోజకవర్గంపైనే

మొత్తం 77 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరగనుంది. కోల్‌కతాలోని 11 నియోజకవర్గాలకుగానూ 5 ప్రాంతాల్లో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ అయ్యే అవకాశం ఉందన్న టీఎంసీ ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండించింది. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ టీవీలతోపాటు మూడంచెల భద్రత, 165మంది అదనపు కౌంటింగ్ అబ్జర్వర్లు, 77మంది పోలీస్ అబ్జర్వర్లను రంగంలోకి దించామని అధికారులు తెలిపారు. క్యూఆర్ కోడ్ పాస్ ఉన్న వారినే కౌంటింగ్ హాల్‌లోకి అనుమతించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. మొబైల్ ఫోన్లను పూర్తిగా నిషేధించారు. ఇప్పుడు అందరి దృష్టి 'భవానీపుర్' నియోజకవర్గంపైనే నెలకొంది. సీఎం మమతా బెనర్జీ, బీజేపీ సీనియర్ నేత సువేందు అధికారి ఇక్కడ బరిలో ఉన్నారు. దీనికి సంబంధించిన కౌంటింగ్ సఖావత్ మెమోరియల్ కేంద్రంలో జరగనుంది.మరోవైపు ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి భద్రతా సమీక్షా సమావేశం నిర్వహించింది. ఎన్నికల ఫలితాల సమయంలో హింస చెలరేగే అవకాశమున్న 11 జిల్లాలను అత్యంత సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించింది. ఆయా జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించి, భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు ప్రకటించింది. ఈ జాబితాలో ముర్షిదాబాద్, దక్షిణ 24 పరగణాలు, ఉత్తర 24 పరగణాలు, కూచ్ బెహార్, మాల్దా, నాడియా, బీర్‌భూం, పశ్చిమ మేదినీపూర్, హుగ్లీ వంటి జిల్లాలు ఉన్నాయి. ఫలితాలు వెలువడే సమయంలో ఎటువంటి హింస, అల్లర్లు జరగకుండా ఉండేందుకు అన్ని కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలను హై అలర్ట్‌లో ఉంచినట్లు అధికారులు వివరించారు.



### ఒక్క ప్రాణనష్టం కూడా జరగకపోవడం ఇదే మొదటిసారి

రాష్ట్రవ్యాప్తంగా 75వేల మంది కేంద్ర పారామిలిటరీ దళాలను మోహరించినట్లు కేంద్ర హోంశాఖ అధికారులు చెప్పారు. బుల్లెట్లు, పేలుళ్లను తట్టుకోగల అధునాతన మార్క్‌మ్యాన్ సాయుధ వాహనాలను రంగంలోకి దించారు. బంగ్లాదేశ్‌ను ఆనుకుని ఉన్న సరిహద్దు జిల్లాల్లో అదనపు నిఘాను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే కంటెంట్‌ను వ్యాప్తి చేయకుండా అడ్డుకునేందుకు రాజకీయ పార్టీల సోషల్ మీడియా అకౌంట్లు, వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని పలు ముఖ్యమైన ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఎన్ఐఏ అధికారులు నిఘా ఉంచారు. అధికారిక లెక్కల ప్రకారం 2011 ఎన్నికల సమయంలో 25మంది ప్రాణాలు కోల్పోయారు. 2016 ఎన్నికల్లో 30మంది మృతిచెందగా, 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అత్యధికంగా 58మంది మరణించారు. మళ్లీ అటువంటి హింస జరగకుండా నివారించేందుకు ఈ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. 90లక్షల మంది ఓటర్లను తొలగించిన వివాదాస్పద 'ఎస్ఐఆర్' ప్రక్రియ తర్వాత బంగాల్‌లో జరిగిన తొలి ఎన్నికలు ఇవి. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఇతర అగ్రనేతలు బీజేపీ తరఫున ప్రచారం చేశారు. బంగాల్ సర్కార్ అవినీతి, శాంతిభద్రతలు, అక్రమచొరబాట్లు, మహిళా భద్రత, నిరుద్యోగం వంటి అంశాలపై టీఎంసీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తాము అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు అమలుచేస్తామని హామీ ఇచ్చారు. టీఎంసీ తరఫున సీఎం మమతాబెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ అన్నీ తామై ప్రచారం చేశారు. ఎస్ఐఆర్ వేధింపులు, బెంగాలీల అణచివేత, స్థానికేతరులనే అంశాలతోపాటు జాతీయ హామీలను నెరవేర్చడంలో బీజేపీ విఫలమైందని ఆరోపించారు. రికార్డు స్థాయిలో ఓటు వేసిన బంగాల్? ప్రజలు ఎవరికి పట్టం కట్టారో తెలియాలంటే సోమవారం వరకు వేచి చూడాల్సిందే.

## 4లో.. అర్హతే కొలమానం.. రాజకీయాలకు తావులేదు

- త్వరలోనే రెండో విడత 'ఇందిరమ్మ' ఇళ్ల మంజూరు
- కూసుమంచి ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగులేటి భరోసా

Spot Speed NEWS
T MEDIA
న్యూస్ ఏజెన్సీ & మీడియా కన్సల్టెన్సీ
ఆర్.నం. 100/2020
MAMILLA GUDEM, ఖమ్మం | 8919710365
మా సేవలు :
ఉపన్యాసాలకు పాయింట్లు | ప్రెస్ నోట్స్ | ప్రత్యేక సంచికలు | యాడ్ డిజైన్స్ | పేజ్ మేకింగ్
Please Subscribe : tmedia.net.in

# పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు



## నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

**టి మీడియా , మే 3 ,హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్లు ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఎండవేడిమితో అల్లాడుతున్న ప్రజలకు వర్షాలు కాస్త ఉపశమనం కల్పించాయి. పలు జిల్లాల్లో ఈదురుగాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

**మంచిర్యాల జిల్లాలో ఈదురు గాలుల బీభత్సం**
మంచిర్యాల జిల్లా మందమర్రి, రామకృష్ణాపూర్? పట్టణాల్లో ఈదురు గాలులు ఒక్కసారిగా బీభత్సం సృష్టించాయి. ఒక్కసారిగా విపరీతమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలతో కోల్? బెల్ట్? రహదారిపై పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. పలువురి ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు గంట పాటు భారీ వర్షం కురియడంతో జన జీవనం కాసేపు స్తంభించింది.

**ధాన్యం కొనుగోలు కేంద్రంలో పిడుగుపడి కార్మికుడు మృతి**
మహబూబ్?నగర్ జిల్లా కురవి మండలం సూదనపల్లిలో విషాదం చోటుచేసుకుంది. ధాన్యం కొనుగోలు కేంద్రంలో పిడుగుపడి కార్మికుడు మృతిచెందాడు. కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై టార్పాలిన్లు కప్పుడుతుండగా పిడుగుపాటు సంభవించింది. ఈ క్రమంలోనే అక్కడ పనిచేస్తున్న నీలం వెంకన్న ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఇద్దరు రైతులు అస్వస్థతకు గురయ్యారు.

**హుస్నాబాద్ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం**
సిద్ధిపేట జిల్లాలోని హుస్నాబాద్?లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో హుస్నాబాద్ మార్కెట్ యార్డులో ధాన్యం, మొక్కజొన్న తడిసిముద్దయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షార్పణం అవ్వడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మార్కెట్ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ధాన్యం తెచ్చి 15 రోజులు దాటినా కొనుగోలు చేయట్లేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలు కురిసి ధాన్యం తడుస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

**మందమర్రిలో నెలకొరిగిన చెట్లు, కరెంటు స్తంభాలు**
మంచిర్యాల జిల్లా మందమర్రి, రామకృష్ణాపూర్?లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. ఈదురుగాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మందమర్రి, సింగరేణి కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచింది. భద్రాద్రి జిల్లా ఇల్లందు, గుండాల మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల రహదారులపై ఆరబోసిన మొక్కజొన్న కొట్టుకుపోయింది.ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. తెలంగాణ రాష్ట్రంలో ఇవాళ, రేపు కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇదే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది.

**ఆ జిల్లాలకు భారీ వర్షసూచన**
జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. మిగతా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ఐఎండీ విడుదల చేసిన ప్రకటనలో వివరించింది. రానున్న రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఇంచుమించు ఇదే స్థాయిలో కొనసాగి, తదుపరి మూడు రోజుల్లో క్రమేపి రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది.

# ఏసి పేలి నాలుగు అంతస్తుల భవనంలో మంటలు

- 9 మంది సజీవ దహనం

**టి మీడియా , మే 3 , ఢిల్లీ బ్యూరో :**
దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం తెల్లవారుజామున ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. తూర్పు ఢిల్లీలోని వివేక్ విహార్ ప్రాంతంలో ఉన్న నాలుగు అంతస్తుల నివాస భవనంలో చెలరేగిన మంటల్లో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు సమన్వయంతో పనిచేసి పలువురిని కాపాడగలిగాయి. ఇంట్లో ఏసీ పేలి మంటలు చెలరేగాయని భావిస్తున్నాయి. అధికారుల వివరాల ప్రకారం, ఈ ఘటన ఉదయం సుమారు 3.48 గంటల సమయంలో వెలుగులోకి వచ్చింది. వివేక్ విహార్ పోలీస్ స్టేషన్‌కు ఫోన్ కాల్ అందగానే పోలీస్ బృందాలు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నాయి. ఆ సమయంలో భవనంలోని రెండో, మూడో, నాలుగో అంతస్తుల్లో మంటలు తీవ్రంగా వ్యాపించి ఉండటం గమనించారు. మంటల తీవ్రత కారణంగా భవనంలో చిక్కుకున్నవారిని బయటకు తీసుకురావడం కష్టసాధ్యంగా మారింది.




ఈ ప్రమాదాన్ని అదుపులోకి తీసుకురావడానికి మొత్తం 12 అగ్నిమాపక వాహనాలు రంగంలోకి దిగాయి. అగ్నిమాపక సిబ్బంది గంటలపాటు శ్రమించి చివరకు ఉదయం 8 గంటల ప్రాంతంలో మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సమయంలో భవనంలో చిక్కుకున్న 10 నుంచి 15 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. వీరిలో స్వల్ప గాయాలు పొందిన ఇద్దరిని సమీపంలోని గురు తేగ్ బహదూర్ ఆసుపత్రికి తరలించారు. అయితే మంటల తీవ్రత కారణంగా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు నిర్ధరించారు. మృతదేహాలు భవనంలోని వివిధ అంతస్తుల నుంచి వెలికితీశ్శు. మొదటి అంతస్తు నుంచి ఒక మృతదేహం, రెండో అంతస్తు నుంచి ఐదు మృతదేహాలు, మెట్ల ప్రాంతంలో మూడు మృతదేహాలు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. మృతుల గుర్తింపు ఇంకా సాధ్యంకాలేదని, దీనికి డీఎన్‌ఏ పరీక్షలు అవసరమని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ పంకజ్ లూత్రా మాట్లాడుతూ, ఘటనాస్థలానికి చేరుకున్న వెంటనే పై అంతస్తులకు వెళ్లి పరిస్థితిని పరిశీలించినట్లు చెప్పారు. మృతుల పరిస్థితి చాలా దారుణంగా ఉండటంతో వారి లింగాన్ని కూడా గుర్తించడం కష్టంగా మారిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం మరిన్ని బాధితులు ఉన్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఢిల్లీ పోలీస్ ఉన్నతాధికారి రాజేంద్ర ప్రసాద్ మీనా మాట్లాడుతూ, అగ్ని ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక దళాలు, పోలీసులు వేగంగా స్పందించారని చెప్పారు. మొదట్లో 3 నుంచి 4 మృతదేహాలు మాత్రమే గుర్తించామని, తర్వాత గాలింపులో మరిన్ని మృతదేహాలు బయటపడ్డాయని వివరించారు. భవనంలో ఇంకా ఎవరైనా చిక్కుకుపోయి ఉండే అవకాశం ఉండటంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. అయితే ప్రాథమికంగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు కలిసి సమగ్ర విచారణ చేపట్టారు. భవనంలోని విద్యుత్ వ్యవస్థ, అగ్ని భద్రతా ప్రమాణాలపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది.
స్థానికుల వివరాల ప్రకారం, మంటలు ఒక్కసారిగా వేగంగా వ్యాపించడంతో భవనంలో ఉన్నవారికి బయటకు రావడానికి ఎక్కువ సమయం దొరకలేదని తెలిపారు. ముఖ్యంగా పై అంతస్తుల్లో ఉన్నవారు మంటల్లో చిక్కుకుపోయి బయటపడలేకపోయారని చెబుతున్నారు. పొగ భారీగా వ్యాపించడం కూడా రక్షణ చర్యలకు అడ్డంకిగా మారింది. ఈ ఘటనతో పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అప్రమత్తంగా అధికారులు సమీప ప్రాంతాలను ఖాళీ చేయించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది కూడా సహకరించి అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలకు మార్గం సులభం చేశారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉన్నప్పటికీ, గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల గుర్తింపు, వారి కుటుంబాలకు సమాచారం ఇవ్వడం వంటి ప్రక్రియలు కొనసాగుతున్నాయి.

# జువెల్లరీ షాపులో కాల్పుల కలకలం

**టి మీడియా , మే 3 , కరీంనగర్ :**
కరీంనగర్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. నగరంలోని పీఎంజే జువెల్లరీ షాపులోకి చొరబడిన ఐదుగురు దుండగులు, సిబ్బందిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి, భారీ మొత్తంలో ఆభరణాలను దోచుకెళ్లారు. దుండగుల కాల్పుల్లో ముగ్గురు సిబ్బంది గాయపడగా, వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీపీ గౌస్ ఆలం విచారణను ముమ్మరం చేశారు.




**సీసీ ఫుటేజీ ఆధారంగా గాలింపు**
ఉదయం 11 గంటల ప్రాంతంలో కరీంనగర్?లోని పీఎంజే జువెల్లరీ షాపులోకి వినియోగదారులుగా వచ్చిన ఐదుగురు దుండగులు, నగలు చూపించమని అడగగా సిబ్బంది ఆభరణాలు చూపించారు. అనంతరం దుండగులు సిబ్బందిని గన్‌తో బెదిరించారు. వారిపై 7-8 రౌండల్ కాల్పులు జరిపారు ఆపై వారిని కట్టేసి చూపించిన నగలను దోచుకెళ్లారు. దుండగుల కాల్పుల్లో ముగ్గురు సిబ్బంది గాయపడగా, వారిని ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీపీ గౌస్ ఆలం విచారణ జరుపుతున్నారు. జువెల్లరీ షాపు సమీపంలోని డ్రైనేజీలో కత్తెర, ప్లాస్టర్, తుపాకీ మ్యాగ్జిన్ గుర్తించారు. ఘటనా స్థలిలో బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దుండగుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

**పక్క జిల్లాలో హై అలర్ట్**
పీఎంజే జువెల్లరీ షాపు సిబ్బందిపై కాల్పులకు తెగబడిన ఘటనలో పక్క జిల్లా జగిత్యాల పోలీసులు అప్రమత్తమయ్యారు. దుండగుల కోసం గాలింపు చేపట్టారు. జగిత్యాలలో హై అలర్ట్ ప్రకటించిన పోలీసులు, జిల్లా ప్రవేశ ద్వారాల వద్ద అనుమానితుల కోసం చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేస్తున్నారు.

**పథకం ప్రకారమే దోపిడీ**
సమాచారం బండి సంజయ్?కు చేరడంతో ఆయన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు విచారణ ప్రారంభించారని, గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. కొందరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తున్నట్లు చెప్పారు. క్లూస్ టీమ్ వివరాలు తీసుకుంటున్నారని, నిందితులు తెలుగు, హిందీ మాట్లాడుతున్నట్టు తెలిసిందన్నారు. పథకం ప్రకారమే ఈ దొంగతనం జరిగిందని భావిస్తున్నామన్న బండి సంజయ్, నిందితులను తప్పకుండా పట్టుకుంటారన్న నమ్మకం ఉందన్నారు. షాపు సిబ్బంది సాహసోపేతంగా వ్యవహరించారన్న ఆయన, గాయపడిన వారికి ప్రాణాపాయం ఏమీ లేదని వైద్యులు చెప్పారని స్పష్టం చేశారు.

# చిన్నమునగాలలో అగ్నిప్రమాదం

- పాలీహౌస్ దగ్ధం- రైతుకు నష్టం

**టీ మీడియా, మే3, కొణిజర్ల:**
మండల పరిధిలోని చిన్నమునగాల గ్రామంలో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగి, సమీపంలోని మొక్కజొన్న దంటు (వ్యర్థాలు)కు అంటుకుని వేగంగా వ్యాపించాయి. ఈ మంటలు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాపగంటి నాగభూషణంకు చెందిన పాలీహౌస్‌ను అంటుకోవడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. క్షణాల్లోనే మంటలు వ్యాపించి పాలీహౌస్ పాక్షికంగా దగ్ధమై, రైతుకు ఆస్తి నష్టం సంభవించింది. సమాచారం అందుకున్న స్థానిక సర్పంచ్ పూనాటి బాబురావు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది, స్థానికులు జేసీబీ సహాయంతో సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.



ప్రాథమిక సమాచారం ప్రకారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. సకాలంలో మంటలను అదుపులోకి తీసుకురావడంతో గ్రామంలోని ఇతర ప్రాంతాలకు ప్రమాదం తప్పింది.

# నిందితులను పట్టుకుంటాం

- కరీంనగర్ సీపీ వెల్లడి

**టి మీడియా , మే 3 , కరీంనగర్ :**
కరీంనగర్ పీఎంజే జ్యువెలరీ షాపులో దోపిడీ కేసు వివరాలను కరీంనగర్ సీపీ గౌస్ ఆలం మీడియాకు వెల్లడించారు. ఐదుగురు తుపాకులతో ప్రవేశించారని తెలిపారు. బంగారం కొనుగోలు చేస్తున్నట్లు ప్రవర్తించి తుపాకులతో బెదిరించారని పేర్కొన్నారు. వారిలో నలుగురు నాలుగు రౌండ్లు ఫైరింగ్ చేశారని చెప్పారు. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది గాయపడ్డారని అన్నారు. దోపిడీ తర్వాత వెపన్స్‌ను వారి వెంటనే తీసుకెళ్లారని వివరించారు. ఈ దోపిడీకి సంబంధించి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని సీపీ తెలిపారు. నిందితులను కచ్చితంగా పట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నామని చెప్పారు. మరోవైపు ఈ ఘటనపై మాజీ మంత్రి,



కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్రంగా మండిపడ్డారు. 24 గంటల్లోగా నిందితులను పట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కాల్పుల ఘటన ప్రభుత్వ వైఫల్యమే అని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూడాలని అన్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 10.45 గంటల ప్రాంతంలో జ్యోతినగర్‌లోని పీఎంజే జ్యువెలరీ సిబ్బంది షాపు తెరిచి లాకర్ల నుంచి డిస్‌ప్లేలో నగలు పెడుతున్నారు. ఆ సమయంలో రెండు బైక్‌లపై ఐదుగురు దుండగులు షాపులోకి ప్రవేశించారు. తుపాకులు చూపించి నగలు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని సిబ్బంది అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. వారిపై 7-8 రౌండల్ కాల్పులు జరిపారు. అనంతరం పెద్ద బ్యాగ్‌లో బంగారు నగలను తీసుకుని పరారయ్యారు. ఈ కాల్పుల్లో నలుగురు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. జ్యువెలరీ షాపులో దోపిడీ గురించి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. ఘటనాస్థలిలో కొన్ని బుల్లెట్ షెల్స్, తుపాకీ మ్యాగజైన్ స్వాధీనం చేసుకున్నారు.

# దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

- సిఐ గోపాలకృష్ణ పోలీస్ శాఖ సూచనలు

**టీ మీడియా, మే 3, చింతూరు:**
దేవాలయాల్లో జరుగుతున్న దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని చింతూరు సిఐ గోపాలకృష్ణ సూచించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవలి కాలంలో దేవాలయాల్లో దేవుళ్ల నగలు దోచుకోవడం, హుండీ డబ్బులను దొంగిలించడం వంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. జిల్లా ఎస్పీలు అమిత్ బర్దర్, హేమంత్ ఆదేశాల మేరకు చింతూరు పోలీస్ సర్కిల్ పరిధిలోని దేవాలయ కమిటీలకు పలు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. దేవుళ్ల విగ్రహాలపై ఉన్న నగలను తొలగించి భద్రంగా భద్రపరచుకోవాలని, హుండీలలోని నగదును తరచుగా లెక్కించి బ్యాంకుల్లో జమ చేయాలని సూచించారు. అలాగే దేవాలయాల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులను వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. దేవాలయ కమిటీలు చొరవ తీసుకుని పోలీస్ శాఖతో దొంగతనాలను అరికట్టవచ్చని సిఐ గోపాలకృష్ణ తెలిపారు.



# బ్యాటరీ పేలి విద్యార్థికి గాయాలు

- తెగిపడిన చేతి వేళ్లు

**టి మీడియా , మే 3 , శివంపేట :**
మెదక్ జిల్లా శివంపేట మండల కేంద్రంలో విషాదఘటన చోటు చేసుకుంది. నాలుగవ తరగతి చదువుతున్న రాజిపేట శివతేజ్ అనే విద్యార్థి ఓ దుకాణంలో ఎండాకాలం దృష్ట్యా చేతిలో పట్టుకునే చిన్న ఫ్యాన్ కలిగిన బ్యాటరీ కొనుగోలు చేశాడు. ఆ బ్యాటరీను ఉపయోగిస్తున్న సమయంలో అకస్మాత్తుగా పేలుడు ధాటికి ఏకంగా ఎడమ చేతి నాలుగు వేళ్లు తెగి తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని కుటుంబ సభ్యులు వెంటనే కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. నాణ్యత లేని బ్యాటరీల విక్రయంపై అధికారుల పర్యవేక్షణ అవసరమని ప్రజలు కోరుతున్నారు.




# భాధ్యతలు స్వీకరించిన అడ్వకేట్ భానుప్రియ

**టి మీడియా , మే 3 ,హైదరాబాద్ బ్యూరో :**
ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా నియమితులైన అడ్వకేట్ సుంకర భానుప్రియ భాధ్యతలు స్వీకరించారు. నేడు హైదరాబాద్ లోని సమతా నాలెడ్జ్ సెంటర్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు యన్.జే. సాంమ్సన్ నియమకపు పత్రం అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో భానుప్రియ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే, డా.బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానం తో ఆవిర్భావించిన ఐ.యల్.పి.ఏ దేశం కోసం, రాజ్యాంగం కోసం పనిచేస్తుందని న్యాయవాదులకు వృత్తి నైపుణ్యం లో శిక్షణతో పాటు, న్యాయవాదుల సమస్యలు పరిష్కరం కోసం ఐ.యల్.పి.ఏ. పని చేస్తుందని తెలిపారు. తనపై నమ్మకం తో తనకు జాతీయ స్థాయి పదవి ఇచ్చినందుకు జాతీయ అధ్యక్షురాలు సుజాత ఛౌదంటే, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు యన్.జే.సాంమ్సన్ కు భానుప్రియ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణ రెడ్డి, మారపాక రమేష్, మహమ్మద్ సాదిక్ పాషా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జనపరెడ్డి గోపి కృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దొడ్డ సామంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ లక్ష్మి, సురేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.




# గజ్వేల్ ఔటర్ రింగ్ రోడ్ పై ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మృతి

**టి మీడియా , మే 3 సిద్దిపేట :**
జిల్లాలోని గజ్వేల్ ఔటర్ రింగ్ రోడ్‌పై ఆదివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కారు డివైడర్‌ను ఢీకొని, కరీంనగర్‌కు వెళ్తున్న లారీ ని ఢీకొడంతో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు అంబులెన్స్ సహాయంతో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




# ఔటర్ రింగ్ రోడ్‌పై మృత్యుఘోష

## మూడేళ్లలో పెరిగిన రోడ్డు ప్రమాదాలు

**టి మీడియా , మే 3 ,హైదరాబాద్ బ్యూరో :**
హైదరాబాద్ నగరాన్ని చుట్టుముట్టే 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్ పై ప్రమాదాల సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతోంది. ప్రతి ఏడాది రోడ్డు సేఫ్టీ వారోత్సవాలు నిర్వహణ పేరుతో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలను మాత్రం అధికారులు నివారించలేకపోతున్నారు. సజీవంగా వస్తాయి లాంటి కార్యక్రమాల్ ద్వారా రోడ్ సేఫ్టీ పై ప్రజలకు చాలా అవేర్నెస్ ఇచ్చినా ప్రమాదాల్లో ప్రాణాలు పోతున్నాయి. గడచిన ఐదు సంవత్సరాల్లో హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పై ప్రమాదాలు భారీగా చోటు చేసుకున్నాయి. 2022లో 1,020గా ఉన్న ప్రమాదాలు 2024 నాటికి 1,582కి పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అదే సమయంలో మరణాలు కూడా 170 నుండి 250కు పైగా పెరిగాయి. తాజాగా 2026 మే 1న శంషాబాద్ సమీపంలో జరిగిన ఘోర ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇక రాచకొండ పోలీసుల గణాంకాల ప్రకారం 2025లో ఓ ఆర్ ఆర్ పై ప్రమాదాలు గణనీయంగా పెరిగాయి. 2024లో 52 కేసులు నమోదు కాగా, 2025లో అవి 76కి చేరాయి. మరణాలు 21 నుండి 37కి పెరిగాయి. గాయాల సంఖ్యలో కూడా భారీ పెరుగుదల కనిపించింది. 31 నుండి 80కి పెరగడం పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారిందో స్పష్టంగా చూపిస్తోంది. సైబరాబాద్ పరిధిలో కూడా 2025లో 34 మరణాలు నమోదయ్యాయి. మొత్తం మీద అన్ని కమిషనరేట్లలో కలిపి 70కు పైగా మరణాలు సంభవించినట్లు అంచనా.



**తెల్లవారుజామునే ప్రమాదాలు ఎక్కువ**
మే 1, 2026న యాదగిరిగుట్ట, స్వర్ణగిరి ఆలయ దర్శనం ముగించుకొని హైదరాబాద్ వస్తున్న కుటుంబం వాహనం శంషాబాద్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. తీవ్ర ఢీకొట్టడంతో కారు పూర్తిగా ధ్వంసమై, ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ అలసట కారణంగా నిద్రపోవడం ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఓ ఆర్ ఆర్ పై ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా అతివేగం, లేన్ డిసిప్లిన్ లోపం, అర్ధరాత్రి సమయంలో రాష్ డ్రైవింగ్, రోడ్డు మీద ఇష్టం వచ్చినట్టు లారీలు నిలిపివేయడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి అంశాలు గుర్తించబడ్డాయి. ముఖ్యంగా రాత్రి 3 నుంచి 6 గంటల మధ్య ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.. ఔటర్ పై ఉన్న నాలుగు లేన్స్ లో 1,2 లేన్ లలో కార్లు వెళ్తాయి. ఈ లేన్ లలో వెళ్లే వాహనాల స్పీడ్ 120 నుండి 140 మధ్యలో ఉంటుంది.

**నిబంధనలకు విరుద్ధంగానే**
ఇక 3,4 లేన్ లలో ఎక్కువగా లారీలు వెళుతుంటాయి. ఇవి 80 నుండి 100 స్పీడ్ లో ఉంటాయి. కార్లు 140 స్పీడ్ తో లేన్ లు మారినప్పుడు ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మరోవైపు ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాలను పార్క్ చేయడం అనేది నిబంధనలకు విరుద్ధం. అవుటర్ ఎమర్జెన్సీ లేన్ ఉన్నప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో పార్క్ చేయవలసి వస్తే ఖచ్చితంగా పార్కింగ్ లైట్లు ఆన్ చేయాలి. కానీ చాలామంది లారీ డ్రైవర్లు ఈ నిబంధనను పట్టించుకోకుండానే ఇష్టానుసారంగా ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాలను పార్క్ చేస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్ పై ఎక్కువ ప్రమాదాలు ఆగి ఉన్న వాహనం ను డీ కొట్టడంతోనే అవుతున్నాయి.

**పోలీసుల చర్యలు**
ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం 'జీరో యాక్సిడెంట్ యాక్షన్ ప్లాన్'ను అమలు చేయడానికి సిద్ధమైంది. అండర్‌పాస్‌ల వద్ద సీసీటీవీ నిఘా, రూల్స్ ఉల్లంఘించే వారిపై ఆటోమేటిక్ జరిమానాలు, వేగ నియంత్రణ, రాత్రిపూట పెట్రోలింగ్ బలోపేతం వంటి చర్యలు తీసుకోనున్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్ రద్దు చేసే చర్యలు కూడా ప్రతిపాదించారు. గత ఐదేళ్లలో ఓ ఆర్ ఆర్ పై 375 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కఠిన చర్యలు, అవగాహన కార్యక్రమాలు, రోడ్డు నిర్మాణ లోపాల సవరణ లేకపోతే ఓ ఆర్ ఆర్ మరిన్ని ప్రాణాలను బలి తీసుకునే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# వర్షంలోనూ 'భరోసా'
# బచ్చోడు ప్రజా దర్బార్‌కు అపూర్వ స్పందన

**టీ మీడియా, మే 3, తిరుమలాయపాలెం:**
పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండలం బచ్చోడు క్లస్టర్ పరిధిలో ఆదివారం నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమానికి వర్షాన్ని లెక్కచేయని ప్రజలు భారీగా తరలివచ్చారు. వర్షం కురుస్తున్నప్పటికీ ప్రజలు తమ సమస్యలను తెలియజేయడానికి ముందుకు రావడం విశేషం. జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమం మధ్యలో వర్షం మొదలుకావడంతో సభా ప్రాంగణం తడిసిపోయింది. దీంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెంటనే అధికారులను అప్రమత్తం చేసి, పాఠశాలలోని తరగతి గదిలోకి వెళ్లి అక్కడే ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. బెంచీలపై కూర్చుని అర్జీలు తీసుకుంటూ, "మీ సమస్యలు త్వరగా పరిష్కరిస్తాం" అంటూ బాధితులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులకు ముగింపు పలకాలని తెలిపారు. ప్రభుత్వం నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సేవలు అందించాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యమని పేర్కొన్నారు. అందులో భాగంగానే క్లస్టర్ స్థాయిలో ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. వర్షం మధ్య కూడా కొనసాగిన ఈ ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.







# భద్రకాళి-వీరభద్రుల కళ్యాణం

**టీ మీడియా, మే 3, టేక్మాల్:**
టేక్మాల్ మండలం బొడ్మట్పల్లి గ్రామంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కళ్యాణోత్సవం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య కళ్యాణ వేదికపై భద్రకాళి--వీరభద్రుల వివాహం అత్యంత కమనీయంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోకకల్యాణార్థం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ స్వాగతం పలికారు. కళ్యాణోత్సవంలో దంపతులు పెళ్లిపెద్దలుగా పాల్గొని సేవలందించారు. భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం గ్రామంలో నిర్వహించిన విగ్రహాల ఊరేగింపు, స్వాముల విన్యాసాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

**వీరభద్ర స్వామిని దర్శించుకున్న మంత్రి దామోదర్**
ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బొడ్మట్పల్లి గ్రామంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మంత్రి దామోదర్‌ను శాలువాతో సన్మానించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయానికి నిధులు మంజూరు చేయాలని కమిటీ కోరగా, మంత్రి సానుకూలంగా స్పందిస్తూ అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రమేష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకరప్ప, వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు వినోద్ కుమార్, గ్రామ సర్పంచ్ అవినాష్, నాయకులు సత్యనారాయణ, భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం చేయాల్సిన పోలీసు అధికారులే అడ్డదారి




- ఏసీబీని ఆశ్రయిస్తున్న బాధితులు

**టి మీడియా , మే 3 ,హైదరాబాద్ బ్యూరో :**

శాంతిభద్రతల పరిరక్షణే కాదు బాధితులకు అండగా ఉండాల్సిన పోలీసులు లంచగొండులుగా మారుతున్నారు. ప్రమాదం జరిగినా సమస్య వచ్చినా ప్రజలు పరిగెత్తేది పోలీస్ స్టేషన్‌కే. మరి న్యాయం చేయాల్సిన పోలీసు అధికారులే అడ్డదారులు తొక్కుతూ లంచాలు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల లంచాలు తీసుకుంటూ వరుసగా ఏసీబీకి పోలీసులు చిక్కుతుండడం ఆందోళన కలిగిస్తోంది.ప్రజల ప్రాణాలను ఆస్తులను కాపాడాల్సిన రక్షక భటులు ఆ పేరుకే విరుద్ధంగా కొందరు లంచాల దందాలో మునిగి తేలుతూ ఆ శాఖ గౌరవాన్ని దిగజారుస్తున్నారు. అవినీతి నిరోధక శాఖ దాడుల్లో ఏఎస్ఐ, ఎస్ఐ, ఇన్‌స్పెక్టర్ స్థాయిల అధికారులు లంచాలు తీసుకుంటూ పట్టుబడుతున్నారు. చిన్న చిన్న కేసుల పరిష్కారం నుంచి పెద్ద కేసుల వరకు లంచాలు డిమాండ్ చేస్తున్నారు. ఫిర్యాదు నమోదు చేయాలన్నా, కేసు ముందుకు కదలాలన్నా, నిందితుడిని విడిపించాలన్నా, ఇలా ప్రతి దానికి ఒక రేటు నిర్ణయించి మరీ వసూలు చేస్తున్నారు. చేసేది లేక బాధితులు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. జిల్లాలతో పాటు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్లలో కొన్ని ఠాణాల్లో అధికారులు, సిబ్బంది ప్రతి పనికి లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల స్వయంగా డీజీపీ శివధర్‌రెడ్డి స్వయంగా లంచాలు తీసుకునే పోలీసు సిబ్బంది, అధికారులను హెచ్చరించారు. అయినప్పటికీ పరిస్థితుల్లో మార్పు రావడం లేదు.

**లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డ పోలీసులు**

తాజాగా వికారాబాద్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఇన్‌స్పెక్టర్ సరోజ, ఎస్ఐ రాణి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. పెండింగ్ కేసులో నోటీసులు జారీ చేసేందుకు వీరిద్దరు రూ.60 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంట్లో రూ.20 వేలు పోలీస్‌స్టేషన్‌లోనే తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. వీరిద్దరిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. శంషాబాద్ విమానాశ్రయం అవుట్ పోస్టు ఇన్‌స్పెక్టర్ కనకయ్య, ఎస్ఐ సైదేశ్వర్ కలిసి ఓ కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేయడంతో పాటు కుటుంబసభ్యులను అరెస్టు చేయకుండా ఉండేందుకు బాధితుడి నుంచి 5 లక్షల రూపాయలు లంచం డిమాండ్ చేశారు. ఇందులో రూ.2 లక్షల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం ఏసీబీ బృందం సిఐ కనకయ్య నివాసంలో సోదాలు చేయగా రూ.33.97 లక్షలు నగదు తో పాటు ఆస్తులకు సంబంధించి దస్త్రాలు లభించాయి. సీఐ కనకయ్య, ఎస్ఐ సైదేశ్వర్‌ను అరెస్టు చేసిన అధికారులు న్యాయస్థానంలో హాజరుపరచగా వారికి కోర్టు రిమాండ్ విధించింది. వారిద్దరని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

**రూ.60 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్?**

దొంగతనం కేసులో అరెస్టైన నిందితులు పాండు, పరుశురాంకు కేసు లేకుండా చూస్తానని చెప్పి మెదక్ జిల్లా టెక్మాల్ ఎస్ఐ రాజేష్ రూ.80 వేలు లంచం డిమాండ్ చేసి మొదట రూ.30 వేలు తీసుకున్నాడు. మరో రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో పాండు, పరుశురాం ఏసీబీని ఆశ్రయించాడు. రూ.30 వేలు తీసుకుంటుండగా ఎస్ఐ ఏసీబీ దొరికిపోయాడు. ఒక దశలో తప్పించుకోవడానికి గోడ దూకి పొలాల్లోకి పారిపోతుండగా ఏసీబీ బృందం కిలోమీటరు మేర వెంబడించి మరీ పట్టుకుంది. అతను ఏసీబీకి చిక్కడంతో ఆ గ్రామంలో ప్రజలు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

**ఇటీవల లంచం తీసుకుంటు పట్టుబడ్డ పోలీసులు**

చైతన్యపురి పోలీస్‌స్టేష్ ఏఎస్ఐ పూసల బాలయ్య ఓ కేసులో సెక్షన్‌లు మార్చేందుకు బాధితుడి వద్ద నుంచి రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.మాదాపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ గంగాధర్ నోటీసు జారీ చేసేందుకు బాధితుడి దగ్గర రూ.50 వేలు లంచం డిమాండ్ చేశాడు. లంచం సొమ్ము స్వీకరిస్తుండగా దాడి చేసిన ఏసీబీ అధికారులు అతన్ని పట్టుకున్నారు.

కొల్లూరు ఠాణా ఎస్ఐ రమేష్ ఓ కేసులో బాధితుడి వద్ద నుంచి రూ.20 వేల రూపాయలు లంచం తీసుకుంటూ దొరికిపోయాడు.నాగర్‌కర్నూలు జిల్లా తిమ్మాజీపేట ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి ఓ కేసులో రూ.20 వేలు లంచం తీసుకుంటూ చిక్కాడు.నిర్మల్ జిల్లాలోని మహ్మదా ఠాణా ఎస్ఐ అశోక్ 20 వేల రూపాయలు ఓ వ్యక్తి వద్ద నుంచి తీసుకుంటూ పట్టుబడ్డాడు.సిద్దిపేట్ ముస్తాబాద్ పోలీస్‌స్టేష్ ఎస్ఐ వెంకటేశ్వర్లు 15 వేల రూపాయలు లంచం తీసుకుంటూ చిక్కాడు.వరంగల్ కమిషనరేట్‌లోని కేయూసి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ శ్రీకాంత్ ఓ కేసులో బాధితుడి దగ్గర నుంచి 15 వేల రూపాయలు తీసుకుంటూ పట్టుబడ్డాడు.ఇకపై లంచం డిమాండ్? చేస్తే ఈ నంబర్?ని సంప్రదించండి : ఏసీబీ దాడుల్లో వరుసగా ఎస్ఐ, సీఐలు పట్టుబడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కొందరి అవినీతి, అక్రమాలు పోలీసు శాఖకు చెడ్డపేరుతెస్తున్నాయి.ఉన్నతాధికారులుఈవిషయమైహెచ్చరిస్తున్నప్పటికీ కొందరు మాత్రం తమ తీరు మార్చుకోకుండా లంచగొండులుగా మారుతున్నారు. పోలీసులు, ఇతర ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 1064, వాట్సాప్ నంబర్..9440446106 వెబ్‌సైట్: https://acb.telangana.gov.in ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామంటున్నారు.

## కనకదుర్గమ్మ అమ్మవారికి రికార్డు స్థాయిలో ఆదాయం

**టీ మీడియా, మే 3, విజయవాడ:**



విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా భారీ ఆదాయం సమకూరింది. గత 17 రోజులకు (ఏప్రిల్ 15 నుంచి మే 2 వరకు) సంబంధించిన హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించగా, రూ. 2,83,17,242 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.మొత్తం ఆదాయంలో నోట్ల రూపంలో రూ. 2,70,22,242, నాణేల రూపంలో రూ. 12,95,000 ఉన్నట్లు తెలిపారు. సగటున రోజుకు సుమారు రూ. 16.65 లక్షల ఆదాయం లభించినట్లు అంచనా. నగదుతో పాటు 329 గ్రాముల బంగారం, 3.8 కిలోల వెండిని కూడా భక్తులు కానుకలుగా సమర్పించారు. అలాగే, విదేశీ భక్తులు సమర్పించిన 707 అమెరికా డాలర్లు, సౌదీ రియాల్స్, యూఏఈ దిర్హామ్‌లతో పాటు పలు దేశాల కరెన్సీ నోట్లు కూడా హుండీలో లభ్యమయ్యాయి.ఆలయ ప్రాంగణంలోని మహా మండపంలో, సీసీ కెమెరాల నిఘా మధ్య కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఈ లెక్కింపు ప్రక్రియను పూర్తి చేశారు.

## బయోసైన్స్ టీచర్ లేక విద్యార్థులకు ఇబ్బందులు

- రెండేళ్లుగా 10వ తరగతి ఫలితాల్లో నిరాశాజనక స్థితి


**టీ మీడియా, మే 3, ఆత్మకూర్ (వనపర్తి జిల్లా):**




వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ టీచర్ కొరత తీవ్రంగా విద్యార్థులపై ప్రభావం చూపుతోంది. ఒకప్పుడు మెరుగైన ఫలితాలతో పేరు గాంచిన ఈ పాఠశాల, ప్రస్తుతం బయోసైన్స్ ఉపాధ్యాయుడు లేకపోవడంతో జిల్లా స్థాయిలో వెనుకబడుతోంది.గత రెండు సంవత్సరాలుగా 10వ తరగతి ఫలితాల్లో ఈ పాఠశాల చివరి స్థానాల్లో నిలవడం గమనార్హం. 2025లో సైన్స్ సబ్జెక్టులో పలువురు విద్యార్థులు విఫలమవగా, 2026లో కూడా ఏడుగురు విద్యార్థులు అదే సబ్జెక్టులో ఫెయిల్ అయినట్లు సమాచారం. దీనికి ప్రధాన కారణం బయోసైన్స్ టీచర్ ఖాళీ పోస్టు అని తెలుస్తోంది.ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటిని సంప్రదించగా, కొత్తకోట ప్రభుత్వ హైస్కూల్లో అవసరానికి మించి బయోసైన్స్ ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ, వారిలో ఒకరు ఆత్మకూరుకు రాకపోవడంతో సమస్య కొనసాగుతోందని తెలిపారు. ఈ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు.బయోసైన్స్ టీచర్ లేకపోవడంతో, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులను అభ్యర్థించి తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇది విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి, ఆత్మకూరు పాఠశాలకు బయోసైన్స్ టీచర్‌ను తక్షణం నియమించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ఒకప్పుడు ప్రతిభావంతులైన విద్యార్థులను తయారు చేసిన ఈ పాఠశాల ప్రస్తుత పరిస్థితి బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు కూడా ఈ సమస్యపై దృష్టి సారించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయులును సన్మానించిన ఎమ్మెల్యే

**టీ మీడియా ,మే 3,పెబ్బేరు :**



పెబ్బేరు పట్టణంలో ఇటీవల ఉపాధ్యాయ వృత్తిలో పదవీ విరమణ పొందిన మున్సిపాలిటీకి చెందిన బి స్వామినాథ్ ని నివాసంలో ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి శాలువా పూలమాలతో సన్మానించారు ఈ సందర్భంగా మట్లాడుతూ విశ్రాంత ఉపాధ్యాయులు సమాజానికి అమూల్యమైన సేవలు అందించిన మహానుభావులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు జ్ఞానం మాత్రమే కాకుండా నైతిక విలువలు శీలం క్రమశిక్షణలను కూడా బోధించారు మార్గదర్శకత్వం వల్లనే అనేక మంది విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించారు అందుకే విశ్రాంత ఉపాధ్యాయులను గౌరవించడం మన బాధ్యత అని ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు దయాకర్ రెడ్డి ,రణధీర్ రెడ్డి, కౌన్సిలర్ దాసరి జములమ్మ ,దాసరి పెద్ద రాముడు, ఉపాధ్యాయులు దాసరి చిన్న రాములు, దుర్గాప్రసాద్, తదితరులు, పాల్గొన్నారు.

## అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

- భక్తిశ్రద్ధల నడుమ సీతారాముల కళ్యాణ వైభోగం

**టీ మీడియా, మే 3, సింగరేణి (కారేపల్లి):**






ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని వెంకటియా తండా గ్రామంలో ఆదివారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.విగ్రహ ప్రతిష్ఠకు గుగులోతు రవి--రాధా కుటుంబం దాతలుగా వ్యవహరించి పంచలోహ విగ్రహాలను ప్రతిష్టించారు. అలాగే గుగులోతు రవి రూ.1,07,116 విరాళంగా సమర్పించారు.కార్యక్రమానికి గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. మొత్తం కార్యక్రమం భక్తి పరవశంతో, ఆధ్యాత్మిక ఉత్సాహంతో ముగిసింది.

## బొడ్మట్‌పల్లి వీరభద్రుడిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

**టీ మీడియా , మే 3 ,టేక్మాల్ :**



మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామంలో వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట మండల బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.టేక్మాల్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు భక్తుల వీరప్ప, స్థానిక పార్టీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు భక్తులుకళ్యాణ వేడుకను వీక్షించేందుకు పరిసర ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

# సర్వర్ డౌన్ చేసిన ప్రభుత్వం

- మొక్కజొన్న బస్తాలు లోడ్ చేసిన కదలని లారీలు
- రైతు సంఘం నిరసన

**టి మీడియా , మే 3 , వైరా:**



మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వం సర్వర్ నిలుపుదల చేయడం తో ఖమ్మం జిల్లాలో నిలిచిపోయింది అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వైరా మండల కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు అన్నారు.మొక్కజొన్న సాగు చేసిన రైతులు వివరాలు, దిగుమతి చేయాల్సిన గోదాములు వివరాలు సర్వర్ నిలుపుదల వలన కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న బస్తాలు లోడ్ చేసిన లారీలు కు కొనుగోలు సిబ్బంది ట్రక్ సిట్ ఇవ్వకపోవడం తో రైతులు నిరసన వ్యక్తం చేశారు.శని, ఆదివారం లారీలు కొనుగోలు కేంద్రాల్లో నే నిలిచి పోయాయి. ఆదివారం ఖమ్మం జిల్లా లో కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలను రైతు సంఘాల బృందాలు పరిశీలనలో భాగంగా వైరా మండలం లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులను తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కారం చేయాలి అని నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, మండల కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎండ వేడిమి తీవ్రత పెరిగి ఖమ్మం జిల్లా లో కొన్ని మండలాలు రెడ్ జోన్ పరిధిలోకి వచ్చే అవకాశం ఉందని మరోవైపు ఖమ్మం జిల్లా చూట్టూ వడగండ్ల వాన, పిడుగులు పడుతున్నా ప్రభుత్వం లో చలనం లేకుండా పోయింది అని అన్నారు, ఖమ్మం జిల్లా లో పండిన మొక్కజొన్నలు దిగుమతి చేయుటకు అవసరమైన గోదాములు ఖమ్మం, వైరా, మధిర, ఏన్కూరు వ్యవసాయ మార్కెట్లో గోదాములు అందుబాటులోకి తీసుకు వచ్చి రైతులు ట్రాక్టర్లు తో కొనుగోలు కేంద్రాలు నుంచి ఎగుమతి కి అవకాశం ఇవ్వాలి అని డిమాండ్ చేశారు .మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడిగాపులు కు పరిష్కారం చూపాలని మే 4 సోమవారం ఖమ్మం జిల్లా పరిషత్ నుంచి నూతన కలెక్టరేట్ వరకు రైతు సంఘాలు సమిష్టి గా నిర్వహిస్తున్న ప్రదర్శన రైతులు జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అమరనేని అప్పారావు, నల్లమోతు రాజా బాబు, చంద్ర ప్రసాద్, చంద్ర వెంకట్రావు,అమరనేని సాంబశివరావు,ఆళ్ళ శ్రీనివాస్, గుమ్మా మురళి,చంద్ర రాము, రాజేంద్ర ప్రసాద్, వేమూరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తమోడిన రహదారులు

- వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు బలి • నలుగురికి గాయాలు!

**టి మీడియా , మే 3, సిద్దిపేట**



గజ్వేల్– ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న ఓ కారును లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న వారిలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఇదిలావుంటే, హుస్నాబాద్ మండలం పందిళ్ళ వంతెన సమీపంలో జరిగింది. శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన గంగం శ్రీధర్ రెడ్డి (40) తన భార్య దివ్య తేజ (32), కుమారుడు నిహాన్ రెడ్డి (11), కుమార్తె శ్రీనిక (6)లతో కలిసి హైదరాబాద్ నుండి స్వగ్రామానికి కారులో బయలుదేరారు. పందిళ్ళ వంతెన వద్దకు రాగానే కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి గాయాలు కాగా, భార్య దివ్య తేజ, కుమారుడు నిహాన్ రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే సిద్దిపేట ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వారిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.ఒకే రోజు జిల్లాలో జరిగిన ఈ రెండు ప్రమాదాలు ప్రయాణికుల్లో ఆందోళన కలిగించాయి. అతివేగం, అజాగ్రత్తే ఈ ప్రమాదాలకు కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది.

## గాలివాన బీభత్సం... కల్లాల్లో తడిచిన పంటలు

- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

**టీ మీడియా, మే 3, సింగరేణి (కారేపల్లి):**



ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన గాలులతో కూడిన భారీ వర్షం రైతుల జీవితాల్లో విషాదాన్ని నింపింది. అరుగాలం కష్టపడి పండించిన పంటలు కల్లాల్లోనే తడిచి నష్టపోయాయి.ముఖ్యంగా మిరప, మొక్కజొన్న, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న పంటలు, ఇప్పటికే కళ్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం ఒక్కసారిగా వర్షానికి తడవడంతో రైతులు ఏం చేయాలో అర్థం కాక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇక మాదారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం కూడా పూర్తిగా తడవడంతో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. తడిసిన మొక్కజొన్నను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో అప్పుల బారిన పడి మరింత కష్టాల్లో పడే పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

గాలివాన తీవ్రతకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. పలు ఇళ్ల పైకప్పులు, రేకులు ఎగిరిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.మొత్తంగా ఈ గాలివాన సింగరేణి మండలంలో రైతుల ఆశలను చెదరగొట్టి, వారి కష్టాన్ని నీరుగార్చింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

## బంగాల్‌లో ఓట్ల కౌంటింగ్

### -24 గంటల ముందే రెండు దేశాల బార్డర్స్ క్లోజ్

**టి మీడియా , మే 3 , ఢిల్లీ బ్యూరో :** బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం జరగనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు, శాంతి భద్రతలను కాపాడేందుకు కేంద్రం ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. బంగాల్‌తో బార్డర్‌ను పంచుకునే రెండు దేశాల అంతర్జాతీయ సరిహద్దులను ఓట్ల లెక్కింపు ప్రారంభానికి 24 గంటల ముందే మూసేశారు. భూటాన్, బంగ్లాదేశ్‌లోని కొన్ని ప్రాంతాలతో బంగాల్ పంచుకునే సరిహద్దులను పూర్తిగా సీల్ చేశారు. ఈ మేరకు జల్పాయ్‌గుడి జిల్లా యంత్రాగం వెల్లడించింది.ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటూ అంతర్జాతీయ సరిహద్దుల్లో వాణిజ్య వాహనాల రాకపోకలను 48 గంటల పాటు నిలిపివేశామని జల్పాయ్‌గుడి జిల్లా యంత్రాంగం తెలిపింది. ఆదివారం (మే 3) ఉదయం 6 గంటల నుంచి మంగళవారం (మే 5న) ఉదయం 6 గంటల వరకు బంగాల్‌తో అంతర్జాతీయ సరిహద్దు పంచుకునే రెండు దేశాల బార్డర్లను పూర్తిగా మూసివేశామని ప్రకటించింది. ఈ కాల వ్యవధిలో ఏ వాహనానికి లేదా డ్రైవర్‌కు బంగాల్ నుంచి బంగ్లాదేశ్, భూటాన్‌కు వెళ్లడానికి అనుమతి ఉండదని స్పష్టం చేసింది. అలాగే ఈ రెండు పొరుగు దేశాల నుంచి బంగాల్‌లోకి ప్రవేశించడానికి కూడా పర్మిషన్ లేదని చెప్పింది.






## ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- ప్రారంభించిన ఎమ్మెల్యే

**టీ మీడియా , మే3, పెబ్బేరు :**

పెబ్బేరు ఉమ్మడి మండలంలోని రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు పెబ్బేరు శ్రీ రంగాపూర్ ఐ కె పి కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో ప్రభుత్వ కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలని ధాన్యం చివరి గింజ వరకు కొంటుందని ఎమ్మెల్యే సూచించారు రైతులు ఆందోళన చెందవద్దని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్. వైస్ చైర్మన్ సుమిత్రా ఎల్లరెడ్డి. మార్కెట్ చైర్మన్ ప్రమోదిని పాన్డేశ్వర్ రెడ్డి ,వైస్ చైర్మన్ ఎద్దుల విజయ వర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మహబూబాబాద్ లో గ్యాస్ కష్టాలు

**టీ మీడియా, మే3, నర్సింహులపేట :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీరుతో ప్రజలకు గ్యాస్ కష్టాలు తప్పడం లేదు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో అర్ధరాత్రి నుంచే గ్యాస్ కోసం ఏజెన్సీ ఎదుట వినియోగదారులు క్యూలైన్లలో బారులు తీరి అక్కడే పడుకుంటున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు సరైన సమాధానం ఇవ్వకపోవడం, ఎన్నో రోజులుగా బుకింగ్ చేసినప్పటికీ గ్యాస్ సిలిండర్లు సమయానికి అందకపోవడంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో సమస్య పరిష్కారం కోరుతూ జాతీయ రహదారిపై గ్యాస్ సిలిండర్లు పెట్టి ధర్నా చేపట్టారు.



## ఉచిత సేవలు అందిస్తున్న జననీ హాస్పిటల్

**టీ మీడియా, మే4, పెబ్బేరు :**



పెబ్బేరు పట్టణంలోని జనని హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో పామపురం గ్రామంలో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో డాక్టర్ జయచంద్రారెడ్డి పీడియాట్రిక్ డాక్టర్ ప్రియాంక రెడ్డి స్త్రీ వ్యాధి నిపుణురాలు వారి అధ్యర్యం లో గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరిగింది ఎండలు తీవ్రంగా ఉన్నాయని వడదెబ్బ తగలకుండా ఉండాలని తగు జాగ్రత్తలు సూచించారు గ్రామ ప్రజలు అధిక సంఖ్య లో పాల్గొని ఉచిత వైద్య శిబిరం ను విజయవంతం చేయడం జరిగింది.


# భారత్ అతి పెద్ద ఉపగ్రహం 'మిషన్ దృష్టి' విజయవంతం

## • మేఘాలున్నా పాక్, చైనాపై నిఘా!

**టి మీడియా, మే 3, ఢిల్లీ బ్యూరో :** అంతరిక్ష రంగంలో మరో చారిత్రక ఘట్టం నమోదైంది. భారతదేశపు అతిపెద్ద ప్రైవేట్ ఉపగ్రహం 'మిషన్ దృష్టి'ని విజయవంతంగా ప్రయోగించారు. అమెరికాలోని కాలిఫోర్నియా నుంచి 'స్పేస్ ఎక్స్'కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. శత్రువుల కదలికలను ఇట్టే పసిగట్టే ఈ శాటిలైట్, ఇప్పుడు పాకిస్థాన్, చైనాలకు కొత్త తలనొప్పిగా మారబోతోంది. మిషన్? దృష్టి విజయవంతం కావడంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

### అత్యంత పెద్ద ప్రైవేట్ ఉపగ్రహం

190 కిలోల బరువున్న 'మిషన్ దృష్టి'ని బెంగళూరుకు చెందిన ప్రైవేట్ స్టార్టప్ సంస్థ 'గెలాక్సీఐ' రూపొందించింది. భారత ప్రైవేట్ కంపెనీ నిర్మించిన ఇప్పటివరకు అతి పెద్ద ఉపగ్రహంగా నిలిచింది. ఇది ఆప్టోసార్ అనే ప్రత్యేక హైబ్రిట్ వ్యవస్థ. అందులో ఎలక్ట్రో-ఆప్టికల్ (ఈఓ) , సింథటిక్ ఎపర్చర్ రాడార్ (ఎస్?ఏఆర్) సెన్సర్ల సాంకేతికతో పనిచేస్తుంది. ప్రపంచ అంతరిక్ష చరిత్రలో ఈ తరహా టెక్నాలజీతో పనిచేసే మొట్టమొదటి ఉపగ్రహం ఇదే కావడం విశేషం.




సాధారణ ఉపగ్రహాలు కేవలం వెలుతురు ఉన్నప్పుడు మాత్రమే స్పష్టమైన చిత్రాలను తీయగలవు. అయితే 'మిషన్ దృష్టి' మాత్రం పగలు, రాత్రి అనే తేడా లేకుండా వాతావరణం ఎలా ఉన్నా అత్యంత స్పష్టమైన చిత్రాలను పంపే సామర్థ్యం కలిగి ఉంది. ఇందులో ఉన్న 'సింథటిక్ అపర్చర్ రాడార్' దట్టమైన మబ్బులను సైతం చీల్చుకుని, ఎలాంటి లైటింగ్ లేని కటిక చీకటిలోనూ భూమిపై ఉన్న వస్తువులను స్పష్టంగా ఫోటోలు తీయగలదు. శత్రువుల బంకర్లు, వాహనాల కదలికలు, సరిహద్దుల్లో చొరబాట్లను ఎప్పటికప్పుడు అత్యంత కచ్చితత్వంతో దృష్టి శాటిలైట్ పసిగట్టగలదు.

### పలు ఉపయోగాలు

ఇది ఏకకాలంలో ఆప్టికల్, రాడార్? డేటాను సేకరించి, అవుట్?పుట్?లను ఒకే చిత్రంగా మిళితం చేస్తుంది. దీంతో సాధారణ ఉపగ్రహాల కంటే 3 రెట్లు ఎక్కువ ఉపయోగకర సమాచారం లభిస్తుంది. మిషన్ దృష్టి ద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో సహాయం, వ్యవసాయ పర్యవేక్షణ, సరిహద్దు భద్రత, మౌలిక వసతుల ప్రణాళిక లాంటివి మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చు. భారత అంతరిక్ష సంస్థ ఇస్రో ప్రస్తుతం నిర్వహిస్తున్న 29 భూమి పరిశీలన ఉపగ్రహాలకు ఇది అనుబంధంగా పనిచేస్తుంది.

### పాక్, చైనాకు తలనొప్పి

'దృష్టి' శాటిలైట్ అందుబాటులోకి రావడం పాకిస్థాన్, చైనాలకు నిజంగా పెద్ద తలనొప్పిగా మారే అవకాశం ఉంది. రక్షణ రంగంలో నిఘా కోసం ఇకపై విదేశీ శాటిలైట్లపై ఆధారపడాల్సిన అవసరం భారత్‌కు ఉండదు. 'ఆపరేషన్ సిందూర్' వంటి సమయాల్లో బాంబు దాడుల నష్టాన్ని అంచనా వేయడానికి విదేశీ శాటిలైట్లపై ఆధారపడాల్సి వచ్చేది. ఇటీవల ఇరాన్ యుద్ధం సమయంలో దాడుల ఫోటోలను ఎవరితోనూ పంచుకోవద్దని విదేశీ సంస్థలను అమెరికా ఆదేశించింది. ఇలాంటి పరిస్థితుల్లో దేశ సార్వభౌమాధికారం కాపాడుకోవాలి అంటే సొంత కళ్లు అంతరిక్షంలో ఉండాలి. ఆ లోటును ఇప్పుడు 'దృష్టి' తీరుస్తోంది.

### ప్రధాని మోదీ హర్షం

'మిషన్ దృష్టి' ఉపగ్రహం నింగిలోకి ప్రవేశించడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష ప్రస్థానంలో ఇది ఓ మైలురాయిగా అభివర్ణించారు. భారతదేశపు ప్రైవేటు రంగంలో తయారైన అతిపెద్ద ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడం యువతలో ఉన్న ఆవిష్కరణల పట్ల మక్కువకు, దేశ నిర్మాణ కాంక్షకు నిదర్శనమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. గెలాక్సీఐ బృందానికి అభినందనలు తెలిపారు. ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్ సైతం ఈ ప్రాజెక్టును ప్రశంసించారు. 'దృష్టి' ప్రయోగం విజయవంతం కావడంతో భారత్ రక్షణ కవచం మరింత పటిష్టమైందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

### మరో 9 ఉపగ్రహాలకు ప్లాన్

ఉపగ్రహం కక్ష్యలోకి చేరిన తర్వాత ప్రస్తుతం కమిషనింగ్ దశపై దృష్టి పెట్టామని గెలాక్సీఐ వ్యవస్థాపకుడు, సీఈఓ సుయాశ్ సింగ్ తెలిపారు. అప్టోసార్ డేటాపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోందని పేర్కొన్నారు. గెలాక్సీఐ సంస్థ భవిష్యత్తు ప్రణాళికలు మరింత బ్రహ్మాండంగా ఉన్నాయి. ఇది కేవలం ఒక ప్రయోగం కాదు. రాబోయే రోజుల్లో ఇలాంటివి మరో 9 ఉపగ్రహాలను ప్రయోగించి ఒక 'కాన్‌స్టెలేషన్' ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం దృష్టి శాటిలైట్ 1.5 మీటర్ల అత్యుత్తమ రిజల్యూషన్‌తో చిత్రాలను అందిస్తుంది. రాబోయే ఉపగ్రహాలు 0.5 నుంచి 0.3 మీటర్ల రిజల్యూషన్‌తో రాబోతున్నాయి. ఈ అద్భుతాన్ని సృష్టించిన గెలాక్సీఐ స్టార్టప్ ప్రతిష్టాత్మక ఐఐటీ మద్రాస్ క్యాంపస్‌లో రూపుదిద్దుకోవడం విశేషం. స్వదేశీ పరిజ్ఞానంతో గ్లోబల్ పేటెంట్ కూడా సాధించింది.

### గ్లోబల్ భాగస్వామ్యం కీలకం

ఈ విజయవంతమైన ప్రయోగం, భారత అంతరిక్ష ప్రయాణంలో ప్రపంచ భాగస్వామ్యాల పాత్ర పెరుగుతోందని కూడా స్పష్టం చేస్తోంది. స్పేస్? ఎక్స్? లాంటి అతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యం వల్ల ఉపగ్రహాలను వేగంగా కక్ష్యలోకి పంపే అవకాశం ఉంటుంది. అలాగే భారత స్టార్టప్?లు ఆధునిక టెక్నాలజీ అఏభివృద్ధిపై దృష్టి పెట్టే అవకాశం లభిస్తోంది. కొత్త స్టార్టప్?లకు ప్రేరణగా నిలుస్తోంది. గ్లోబల్ స్థాయిలో భారత టెక్నాలజీ ప్రతిష్ఠ పెరుగుతోంది.

## ఎఐ వచ్చింది... జీవితం తలకిందులయ్యింది ..

### • టెక్ రంగంలో అనూహ్యమైన మార్పులు



**టీ మీడియా, మే3,అమరావతి :** టెక్ రంగంలో అనూహ్యమైన మార్పులు చోటుచేసు కుంటున్నాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వచ్చిన తర్వాత టెక్ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. మానవజీవితం మరింత సులువు అవుతోంది. ఇదే సమయంలో ఎఐ ఉద్యోగాలకు ఎసరు పెడుతోంది. దిగ్గజ టెక్ కంపెనీలతో పాటు అన్ని కంపెనీలు తమ లేఆఫ్స్ ప్రకటిస్తున్నాయి.తాజాగా ఉద్యోగం కోల్పోయిన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తన పరిస్థితిని వివరిస్తూ .... చేసిన సోషల్ మీడియా పోస్ట్ వైరల్‌గా మారింది. దాదాపు 18 ఏళ్ల అనుభవం ఉన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు. ఎఐ కారణంగా తన ఉద్యోగం పోయిందని పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం తాను మెక్‌డొనాల్డ్స్ వెయిటర్‌గా పనిచేస్తున్నట్లు రెడ్డిట్ పోస్ట్‌లో రాశారు. తాను 18 ఏళ్ల సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేశానని, అయితే 8 నెలల క్రితం ఉద్యోగం కోల్పోయినట్లు చెప్పారు. కంపెనీ 12 మంది ఇంజనీర్ల టీం ను తొలగించి, ఇద్దరు ఎఐ నిపుణులను నియమించుకుందని, అప్పటి నుంచి 100కు పైగా ఉద్యోగాల కోసం అప్లై చేసుకున్నప్పటికీ, ఇంకా కొత్త ఉద్యోగం రాలేదని చెప్పారు. ప్రస్తుతం తన కుటుంబాన్ని పోషించుకోవడానికి, ఇంటి రెంట్ చెల్లించడానికి మెక్‌డొనాల్డ్స్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూల్లో అనేక అనుభవాలను ఎదుర్కొన్నట్లు చెప్పారు. తాను చెప్పే సమాధానాలతో ఇంటర్వ్యూయర్లు నచ్చడం లేదని, డెవలపర్ల పని అయిపోయిందని, కంప్యూటర్ సైన్స్ డిగ్రీకి ఇప్పుడు విలువ లేదని నిర్మొహమాటంగా చెబుతున్నారని అతను వెల్లడించారు. తన లాంటి చాలా మంది ఇంజనీర్లు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఇప్పుడు ఎఐ వల్ల కంపెనీలు తక్కువ మందితో పనికానిచ్చేస్తోందని, ఎక్కువ మంది ఉద్యోగుల్ని తీసుకోవడానికి ఇష్టపడటం లేదు. ఎఐ టూల్స్ ఉపయోగించాలని చాలా కంపెనీలు కోరతున్నాయి. ప్రస్తుతం టెక్ రంగం ఎఐపై పట్టు సాధిస్తేనే ఉద్యోగాలు ఉండే పరిస్థితి నెలకొంది. ఇంటర్వ్యూల్లో ఎఐ గురించి, దాని ఉపయోగించడం గురించి తెలియని వాళ్లు వెనకబడిపోతున్నారు.




## కరెంట్ లేకపోతే.. గెడ్డ నీరే గతి !

### • మంచినీటి కోసం ఆదివాసీల తిప్పలు

**టీ మీడియా, మే3,అనకాపల్లి :** వేసవిలో ఆదివాసీ గిరిజనులకు కష్టాలు తప్పడం లేదు. మంచినీటి కోసం వారి ఇక్కట్లను ఎవరూ పట్టించుకోవడం లేదు. రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ జెడ్ జోగంపేట గ్రామంలో ఎస్టీ కొండదొర తెగకు చెందిన 64 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆ గ్రామంలో వాటర్ ట్యాంక్ ఉంది. అయితే రెండ్రోజులుగా ఇక్కడ విద్యుత్ సరఫరా లేదు. కల్యాణలోవ రిజర్వాయర్ వరకు అక్కడి నుంచి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలొస్తే తమ గ్రామాలకు గెడ్డ నీరే గతి అని వాపోతున్నారు. తాగునీటికి ప్రత్యామ్నాయంగా కనీసం బోరు బావి కూడా అందుబాట్లో లేదంటున్నారు. ఉన్న రెండు బోర్లూ పని చేయడం లేదు. వర్షాలొచ్చే ప్రతిసారీ అంతేనని, విద్యుత్ సరఫరా కట్ అయిపోతే నీరుండడం లేదని ఆ కుటుంబాలన్నీ మొత్తుకుంటున్నాయి. పెద్దగెడ్డలో నీళు తెచ్చుకుని సరిపెట్టుకుంటున్నామని, మంచినీళ్లు కోసం పనులు మానుకొని గెడ్డకి వెళ్లి నీరు తెచ్చుకునే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు చొరవ చూపించి ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేయాలని ఆదివారం గ్రామస్తులు వినూత్న రీతిలో ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలో కొండపల్లి నూకరత్నం. చీడిపెల్లి గోవిందమ్మ బిడ్డ జర్నీ తులసి మహిళలు పాల్గొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కరెంట్ సమస్య పరిష్కారం చేసి ప్రత్యామ్నాయంగా బోరు ఏర్పాటు చేసి నీరు ఇవ్వాలని సిపిఎం నాయకులు పాంగి చంద్రయ్య సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు డిమాండ్ చేయడం జరిగింది.

## విశాఖలో కూలిన భవనం.. ఒకరి మృతి

**టీ మీడియా, మే3,విశాఖ:** గాజువాకలోని వికాస్‌నగర్‌లో ఒక భవనం అకస్మాత్తుగా కుప్పకూలిన ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పాత భవనాన్ని జాకీల సహాయంతో పైకి లేపేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. భవనం ఒక్కసారిగా కూలిపోవడంతో శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న అధికారులు, సహాయక సిబ్బంది శిథిలాలను తొలగించి బాధితులను బయటకు తీసేందుకు ముమ్మరంగా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.



## అర్హతే కొలమానం.. రాజకీయాలకు తావులేదు

- త్వరలోనే రెండో విడత 'ఇందిరమ్మ' ఇళ్ల మంజూరు
- కూసుమంచి ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగులేటి భరోసా


**టి మీడియా , మే 3 , కూసుమంచి :** ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, అధికారులే నేరుగా ప్రజల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరించి పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి పారదర్శక పాలనను ప్రజల గడప వద్దకే తీసుకెళ్తున్నామని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా తక్షణ చర్యలు చేపడుతున్నామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని క్లస్టర్లుగా విభజించి నిర్వహిస్తున్న ఈ ప్రజా దర్బార్లలో అందిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును రాజకీయ పార్టీలకు అతీతంగా పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. సాదా బైనామా, నిషేధిత జాబితా , భూమి రికార్డుల వంటి దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా సంక్షేమ పథకాలను మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే తమ ప్రభుత్వ బాధ్యతని, ఇందులో ఎలాంటి జాప్యానికి తావులేదని స్పష్టం చేశారు.ప్రజా దర్బార్లలో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసమే దరఖాస్తులు వస్తున్నాయని, గత ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం ప్రతి సోమవారం ఇళ్ల నిర్మాణ నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందని, మే నెలాఖరు నాటికి రెండో దశ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. వడ్లు, మొక్కజొన్న పంటలను మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నామని, వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 25 లక్షల మందికి రుణమాఫీ చేశామని, రైతు భరోసాను ఎకరానికి 12 వేలకు పెంచడంతో పాటు సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తున్నామని గుర్తుచేశారు. మే 5 నుంచి 7 వరకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్రానికి 'హీట్ వేవ్' అలర్ట్?!

### • ముప్పు ముంగిట 1.60 కోట్ల మంది ప్రజలు

**టి మీడియా , మే 3 ,హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ రాష్ట్రానికి వడగాలులు ప్రకృతి విపత్తులా పరిణమించాయి. ఏటా పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, తరిగిపోతున్న పచ్చదనం, మితిమీరిన ప్లాస్టిక్ వాడకం తదితరాలు ఇందుకు ముఖ్య కారణం. గతం కంటే భిన్నంగా ఈ ఏడాది సమ్మర్?లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలను తాకడంతో రాష్ట్రంలోని 301 మండలాల్లో 1.60 కోట్ల మంది వడగాలుల ముప్పు ముంగిట నిల్చున్నారు. 6 మండలాలు తీవ్ర ముప్పు, 106 మండలాలు అధిక 189 మండలాలు మధ్యస్త ముప్పు జాబితాలో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 2014-25 సంవత్సరాల మధ్య 612 మండలాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు, వడగాలుల సంఖ్య ఆధారంగా ఈ పరిణామాన్ని తెలంగాణ అభివృద్ధి ప్రణాళికా సంస్థ(తెలంగాణ డెవలప్?మెంట్ ప్లానింగ్ సొసైటీ), వాతావరణ శాఖలు సంయుక్తంగా అంచనా వేశాయి.



### ఆ జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు

సాధారణ స్థితితో పోలిస్తే వరుసగా 3 రోజులపాటు 4 డిగ్రీల కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం లేదంటే 45 డిగ్రీల ఉష్ణోగ్రత దాటిన చోట హీట్‌వేవ్ ఉన్నట్లు గుర్తిస్తారు. ఈ ప్రమాణాల ప్రకారం 2014 నుంచి గత సంవత్సరం వరకు నల్గొండ జిల్లాలో అత్యధికంగా వడగాలులు నమోదయ్యాయి. ఇక్కడి మండలాలు అత్యధిక ముప్పు ముంగిట ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, సూర్యాపేట, కరీంనగర్ జిల్లాల్లోని పలు మండలాలు కూడా ఇదే జాబితాలో ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది.

### ప్రాణాలు తీస్తున్న వడగాలులు

ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఆరుబయట పనిచేసే కార్మికులు, అన్నదాతలు, రైతు కూలీలు, ఇతర వృత్తుల వారు ఎక్కువ సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. వడగాలుల బారినపడి 2014 నుంచి ఇప్పటివరకు ఏటా కనీసం 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ ఏడాది ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో మరణాలు సంభవిస్తున్నాయి.

### వడదెబ్బతో ఇద్దరి మృతి

అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బతో శనివారం ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. జగిత్యాల జిల్లాలోని ఎండపల్లి మండలం మారేడుపల్లికి చెందిన జాగేటి రాధ(52), ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అమ్మపాలెనికి చెందిన తేజావత్ చాప్లి(75) అస్వస్థతకు గురై మృతిచెందారు.




## రోడ్డు పక్కన అమ్మే చిరుతిండి తిని

### 27 మంది పిల్లలతో సహా 58 మంది



**టి మీడియా , మే 3 , భువనేశ్వర్:** రోడ్డు పక్కన అమ్మే చిరుతిండి తిని 27 మంది పిల్లలతో సహా 58 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు కోసం మూడు కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒడిశాలోని జాజ్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం ఉదయం పటాపూర్ గ్రామానికి చెందిన పిల్లలు, పెద్దలు స్థానిక విక్రేత వద్ద 'కటక్ దహిబారా' తిన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికే వాంతులు, విరోచనాలు, జ్వరంతో అస్వస్థతకు గురయ్యారు.కాగా, అనారోగ్యం చెందిన 27 మంది పిల్లలు, 31 మంది పెద్దలను దశరథపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, జాజ్‌పూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స తర్వాత 21 మంది డిశ్చార్జ్ అయ్యారని జాజ్‌పూర్ జిల్లా కలెక్టర్ అంబర్ కుమార్ కర్ తెలిపారు.మరోవైపు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్, జిల్లా ప్రధాన ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ చేరిన వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ఈ ఘటనపై విచారణకు మూడు స్వతంత్ర బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు.

## ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర అత్యంత కీలకం

### • ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్



**టీ మీడియా, మే3,న్యూఢిల్లీ :** ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర అత్యంత కీలకమని ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేయడానికి, రాజకీయ పార్టీలు తమ బాధ్యతలను నిర్వహించేందుకు,జర్నలిస్టులు ప్రభుత్వం, ప్రతిపక్షాలు రెండింటినీ నిష్పక్షపాతంగా జవాబుదారీగా ఉంచాలని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన ఎక్స్ లో ఈ విధంగా పేర్కొన్నారు. "ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా తొటి జర్నలిస్టులకు శుభాకాంక్షలు. ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర అత్యంత కీలకమైనది. ప్రభుత్వం, ప్రతిపక్షాలు రెండూ తమ మార్గం నుండి వైదొలగకుండా ఉండేందుకు, పూర్తి నిష్పక్షపాతంగా ప్రభుత్వం, ప్రతిపక్షాలు రెండింటినీ ప్రశ్నించడం పత్రికల బాధ్యత" అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు ఎటువంటి భయం, ఒత్తిడి లేకుండా వాస్తవాలను మాట్లాడే స్వేచ్ఛను కలిగి ఉండాలని పునరుద్ఘాటించారు. స్వేచ్ఛాయుత పత్రిక ప్రజాస్వామ్యానికి గొంతుక అని, కానీ దేశంలో మీడియాపై తీవ్రమై దాడి జరుగుతోందని కాంగ్రెస్ పేర్కొంది. వాస్తవాలను తెలియజేసే, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడానికి కృషి చేసే పాత్రికేయులకు సంఘీభావం ప్రకటిస్తున్నట్లు ఎక్స్ లో పేర్కొంది.ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీ-2026-లో భారత్ 157వ స్థానానికి పడిపోయిన సంగతి తెలిసిందే. గతేడాది 151గా వున్న భారత్ ర్యాంక్ ఇప్పుడు ఏకంగా ఆరు స్థానాలు దిగజారడం ఆందోళనకరం.పొరుగుదేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ లు భారత్ కంటే మెరుగ్గా వుండటం గమనార్హం. ప్రపంచంలోనే అత్యుత్తమ పత్రికా స్వేచ్ఛ వున్న దేశాల్లో గత పదేళ్లుగా నార్వే మొదటి స్థానంలోనే వుంది.